

ఎస్టీ జాబితాలో చేర్చాలి

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు.

8లో▸



బీఆర్‌ఎస్ పాలనలోనే..

బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

8లో▸



గ్రామాభివృద్ధి భేష్

సిక్కిం సర్పంచ్‌ల బృందం శుక్రవారం అజీజ్ నగర్ గ్రామాన్ని సందర్శించింది. గ్రామ అభివృద్ధి బాగుందని కితాబిచ్చింది.

8లో▸

న్యూస్‌రీల్

భూ నిర్వాసితులకు అండగా ఉంటాం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న రైతులు

కందుకూరు: భూ నిర్వాసితులకు అన్ని విధాలా అండగా ఉంటామని, రైతుల కోసం ఎంత వరకైనా పోరాడతామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ తదితరులతో కలిసి శుక్రవారం మండల పరిధిలోని రాచులూరులో ఫ్యూచర్ సిటీలో భాగంగా 330 అడుగుల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులను కలిశారు. అధికారులు వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. భూసేకరణ చట్టానికి విరుద్ధంగా సర్వే నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంద జ్యోతి, నాయకులు భిక్షపతి, ప్రభాకర్, పాండు, జగదీశ్వర్‌రెడ్డి, వెంకటేశ్ ముదిరాజ్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

భగవద్గీతపై అవగాహన అవసరం



కన్హా ఆవరణలో మొక్క నాటుతున్న యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య

నందిగామ: భగవద్గీతపై యువత కనీస అవగాహన కలిగి ఉండాలని ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య అన్నారు. కన్హా శాంతి వనంలో శుక్రవారం నిర్వహించిన గీతోపదేశ్ సమ్మిట్‌ను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత అనేది కొత్త తరానికి చాలా అవసరమని అన్నారు. గీత ఒక జీవన విధానమని, అది ఆధ్యాత్మికంగా, భౌతికంగా మన జీవితాలను ప్రభావితం చేసే ఒక తత్వశాస్త్రమని అభివర్ణించారు. శ్రీరామచంద్ర మిషన్ గురూజీ, హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ అధ్యక్షుడు కమ్లేష్ పటేల్ మాట్లాడుతూ.. గీతోపదేశ్ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత ఆధునిక పోకడలు కాకుండా కొంత వరకు భక్తి మార్గం అలవర్చుకోవాలని సూచించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 20 విద్యాసంస్థల నుంచి 1,500 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరు కావడం చాలా గొప్ప విషయమన్నారు. అంతకు ముందు ఆశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులు, యువత నిర్వహించిన పలు పారాయణాలు, నాటకాలు, కథలు, సంగీత కచేరీలు, నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్తలు రూపాపాయ్, వేద తత్వ వేత్త గౌతమ్ ఖట్టర్, రిషి రంజన్, పలువురు విద్యార్థులు, ఆధ్యాత్మికవేత్తలు, అభ్యాసీలు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై కార్పొరేటర్ ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్పొరేటర్ విజయలక్ష్మి

మీర్‌పేట: అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్వయానా ఓ కార్పొరేటర్ మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించారు. జనప్రియ మహానగర్‌లోని 7వ బ్లాక్ సెల్లార్‌లోని పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాన్ని అడ్డుకోవాలని కలెక్టర్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి స్పందన కరువైంది. ఈ నేపథ్యంలో 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. కాగా కార్పొరేటర్ ధర్నాతో కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది 7వ బ్లాక్ సెల్లార్‌లో చేపట్టిన గదిని జేసీబీతో కూల్చివేశారు. 5, 9ఏ బ్లాకుల్లోని అక్రమ నిర్మాణాలను సైతం త్వరలోనే కూల్చివేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

❖ పెరుగుతున్న రోగుల సంఖ్య

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నిత్యం 250 మంది దాకా వస్తున్నారు. వచ్చిన వారికి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందిస్తున్నారు. ప్రస్తుతానికి ఆస్పత్రిలో ఎలాంటి మందుల కొరత లేదని డాక్టర్ పరీక్షిత్ నరేందర్ తెలిపారు. నూతన భవనం నిర్మిస్తున్నందున ప్రస్తుతం చిన్న భవనంలో ఆస్పత్రిని కొనసాగిస్తున్నారు. అందుబాటులో ఉన్న సౌకర్యలతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ప్రతిరోజు దాదాపు 30 మందికి వివిధ రక్త పరీక్షలు నిర్వహించి వెంటనే రిపోర్టులు అందిస్తున్నారు.



రక్త పరీక్షల కోసం ల్యాబ్ వద్ద ఎదురుచూస్తున్న బాధితులు

సేవలు అంతంతే..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి లోటు రానివ్వం.. నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరిస్తున్నాం.. పీహెచ్‌సీల్లో రోగులకు ప్రాథమికంగా అన్ని వైద్య పరీక్షలు చేసేందుకు పరికరాలు సమకూరుస్తున్నాం.. ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం.. అని ప్రభుత్వాలు, అధికారులు చెబుతున్నా పరిస్థితులు వాస్తవ విరుద్ధంగా ఉంటున్నాయి. ప్రసంగాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ఆయా ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలోని పలు హాస్పిటళ్లలో శుక్రవారం 'సాక్షి' విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

సాక్షి విజిట్

తిప్పలు షరా మామూలే..

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరకొర సౌకర్యాలు
- సరిపడా లభించని మందులు
- పరీక్షల కోసం తప్పని నిరీక్షణ
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- అత్యవసర సేవలకు రిఫర్ చేయాల్సిందే ..

❖ పరీక్షల కోసం ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లకు



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తూరు: స్థానిక పీహెచ్‌సీకి నిత్యం ఓపీ 100 వరకు వస్తుండగా సీజనల్ వ్యాధుల సమయంలో సుమారు 150 వరకు వస్తున్నట్లు వైద్యాధికారి హరికిషన్ తెలిపారు. ఆస్పత్రిలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేయడానికి యంత్రాలు లేవన్నారు. 18 రకాల రక్త, మూత్ర పరీక్షలు మాత్రం చేస్తున్నట్లు వివరించారు. పరీక్షలు చేసిన వారి రోగుల ఫలితాలను తరువాతి రోజున వెల్లడిస్తున్నట్లు తెలిపారు. అన్ని రకాల పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

చర్మ సమస్యతో వచ్చా



నాలుగు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నాను. కొద్దిగా తగ్గినప్పటికీ చర్మంపై ఎర్రటి దద్దుర్లు ఏర్పడ్డాయి. దీంతో కొత్తూరు ప్రాథమిక ఆస్పత్రికి వచ్చి చికిత్స తీసుకుంటున్నాను. వైద్యుల నుంచి స్పందన బాగుంది.

– సాజిద్‌హుస్సేన్, కోల్‌కతా

❖ సగం మందులే..



షాబాద్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

షాబాద్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం 60 నుంచి 70 మంది వరకు వస్తున్నారు. బాధితులకు సరిపడా మందులు అందడం లేదు. దగ్గు, జలుబు, జ్వరం మందులు సరిపడా లేవు. ఉన్నవి ఇచ్చి పంపిస్తున్నారు. దీంతో బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మందులు ఇవ్వడం లేదు



ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రికి వస్తే మందులు ఇవ్వండ లేదు. పేరుకే ప్రభుత్వ ఆస్పత్రి. మందులు సరిగా లేవు.. ఇంజక్షన్లు ఇవ్వడం లేదు. మెరుగైన వైద్యం అందించాలి.

– యాదయ్య, ముద్దెంగూడ, షాబాద్ మండలం

❖ 100 నుంచి 150 మంది

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి రోజు 100 నుంచి 150 మంది వరకు రోగులు వస్తున్నారు. వీరికి ఫీవర్, జలుబు, దగ్గు, బీపీ, షుగర్ తదితర పరీక్షలతోపాటు మూత్రం, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో రిపోర్టులు ఇస్తున్నారు. డెలివరీ కేసులు చేస్తున్నారు. అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నట్టు వైద్య సిబ్బంది చెప్పారు.

❖ వైద్య సిబ్బంది కొరత

మీర్‌పేట: బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం వివిధ వైద్య సేవల కోసం దాదాపు 150 నుంచి 200 మంది వరకు వస్తుంటారు. సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న వారిపై అధిక పని భారం పడుతోంది. సాధారణ వైద్య సేవలతో పాటు రక్త, మూత్ర పరీక్షలు ఉదయం 9 నుంచి ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతున్నాయి. రక్త, మూత్ర పరీక్షలకు సంబంధించిన రిపోర్ట్‌ను సాయంత్రం వరకు సెల్‌ఫోన్‌కు మెసేజ్ ద్వారా పంపిస్తున్నారు.

❖ నొప్పుల మందులు లేవు

కొందుర్గు: స్థానిక పీహెచ్‌సీలో నొప్పుల మందులు అందుబాటులో లేవు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం 'సాక్షి' పీహెచ్‌సీని విజిట్ చేయగా డాక్టర్ అమృత జోసెఫ్ విధుల్లో లేరు. జిల్లా కేంద్రానికి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. రోగులకు ప్రథమ చికిత్స చేయడానికి స్టాఫ్‌నర్స్‌లు లేకపోవడంతో ఏఎన్‌ఎంలే సేవలు అందిస్తున్నారు.

మందులు లేవంటున్నారు



కీళ్ల నొప్పులు, కాళ్ల నొప్పులతో ఆస్పత్రికి వస్తే మందులు లేవని అంటున్నారు. జ్వరం గోలీలు ఇచ్చి పంపుతున్నారు. అన్ని మందులు అందుబాటులో ఉంచితే బాగుంటుంది.

– యాదయ్య, చెర్కుపల్లి

❖ డిప్యూటేషన్లపై సిబ్బంది.. రోగులకు ఇబ్బంది



ఆస్పత్రికి వచ్చిన రోగుల సంఖ్యను నమోదు చేసుకుంటున్న సిబ్బంది

శంకర్‌పల్లి: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అరకొర సదుపాయాలు అందుతున్నాయి. సరైన సిబ్బంది లేక, ఉన్న సిబ్బంది డిప్యూటేషన్ల కారణంగా ఆస్పత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఇక్కడికి నిత్యం సుమారు 100మందికి పైగా బాధితులు వస్తుంటారు. ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒకరే ఉన్నారు. మరో వైద్యురాలికి పోస్టింగ్ ఇచ్చినప్పటికీ డిప్యూటేషన్‌పై శేరిలింగంపల్లికి పంపించారు. స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్.. ఇలా అందరూ వివిధ ప్రాంతాల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఆస్పత్రిలో ఇప్పటికీ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సరైన సిబ్బంది లేక వైద్యం కోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణ మాత్రలు (దగ్గు, జలుబు, జ్వరం) అందుబాటులో ఉన్నట్లు డాక్టర్ రేవతిరెడ్డి తెలిపారు. నిత్యం సుమారు 20 నుంచి 25 మందికి రక్త, మూత్ర పరీక్షలు చేస్తుండగా కొన్ని పరీక్షల కోసం వికారాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నట్టు చెప్పారు.



మైసిగండి ఆస్పత్రిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

❖ నో ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఉదయం సాక్షి విజిట్ చేయగా డాక్టర్ ఓపీ సేవల్లో నిమగ్నమై కనిపించారు. రోగులను పరిశీలించి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌తో పాటు, మరో ఇద్దరు స్టాఫ్ నర్స్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఫార్మాసిస్ట్ సెలవులో ఉన్నారు. రక్త, మూత్ర పరీక్షలు చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయి. సాధారణ రక్త, మూత్ర పరీక్షలకు అరగంట, గంట తర్వాత రిపోర్టులు అందజేస్తున్నట్టు సిబ్బంది తెలిపారు. ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ పరికరాలు అందుబాటులో లేవని చెప్పారు. ఆస్పత్రికి రోజుకు 60 నుంచి 80 మంది ఔట్ పేషెంట్స్ వస్తున్నారు. ఆస్పత్రిల్లో ఒక్కరే వైద్యుడు ఉండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలందిస్తున్నారు. ఆస్పత్రిలో స్వీపర్ లేక ఇబ్బందులు పడుతున్నామని వైద్య సిబ్బంది పేర్కొన్నారు.

❖ ఎమర్జెన్సీ కేసులు రిఫర్



పిచ్చిమొక్కలతో నిండిన ఆస్పత్రి ఆవరణ

ఇబ్రహీంపట్నం: డీఎంహెచ్‌ఓ పరిధిలో ఉన్న స్థానిక 30 పడకల ఆస్పత్రిని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తీసుకొచ్చారు. రెండు వైద్య శాఖల సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అప్పట్లో సాయంత్రం వేళ డ్యూటీ వైద్యులు అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం సాయంత్రం 4 గంటలు దాటిందంటే ఎవరూ ఉండడం లేదు. డీఎంహెచ్‌ఓ నుంచి ముగ్గురు వైద్యులు, 8 మంది నర్సింగ్ సిబ్బంది, వైద్య విధాన పరిషత్ నుంచి ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు నర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. అత్యవసర పరిస్థితులుంటే ఇక్కడి సిబ్బంది వైద్యులకు సమాచారం ఇస్తేనే వస్తున్నారు. ఎమర్జెన్సీ కేసులకు ప్రథమ చికిత్స చేయించి, నగరంలోని ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగినా పట్టించుకునేవారే లేరు. నిత్యం వివిధ గ్రామాల నుంచి 200 మంది వరకు వైద్య చికిత్సల కోసం వస్తున్నారు. వారికి సరపడా మందుల పంపిణీ జరగడం లేదు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలే జరుగుతున్నాయి. ఆపరేషన్ చేయాల్సి వస్తే నగరంలోని ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. గైనకాలజిస్ట్ అందుబాటులో లేరు. అల్ట్రాసౌండ్ పరికరాలున్నా పరీక్షించేందుకు సిబ్బంది లేరు. మల, మూత్ర, రక్త పరీక్షలకు శాంపిల్స్ తీసుకొని నగరంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్, కొండాపూర్‌లోని ప్రభుత్వాస్పత్రి ల్యాబ్‌కు పంపుతున్నారు. అక్కడి నుంచి రిపోర్టులు వచ్చిన తర్వాత చికిత్స అందిస్తున్నారు.

❖ 24 గంటలు సేవలందించాలి



పరీక్షల నిర్ధారణ కోసం రక్తం సేకరిస్తున్న వైద్య సిబ్బంది

యాచారం: మండల కేంద్రంలోని సీహెచ్‌సీని శుక్రవారం ఉదయం విజిట్ చేయగా 50 మందికి పైగా వివిధ గ్రామాలకు చెందిన రోగులు ఆస్పత్రికి వచ్చారు. అత్యధికంగా జ్వరాలు, కాళ్లు, కీళ్ల నొప్పులు, షుగర్, బీపీ లాంటి రోగాలతో ఇబ్బందులు పడుతున్నారు. కావాల్సిన అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. మందులు కూడా అందిస్తున్నారు. 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఇదే విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్‌ను సంప్రదించగా 24 గంటల పాటు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

వారమైనా బియ్యం రాలే..

- దుకాణాలకు చేరని రేషన్ బియ్యం
- సన్న బియ్యం పంపిణీ ప్రకటనతో జాప్యం
- గోదాములు దాటని సరుకులు
- రేషన్ షాపుల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రతి నెలా ఒకటో తేదీనే చౌక ధరల దుకాణాలకు చేరుకోవాల్సిన సరుకులు వారం రోజులైనా సరఫరా కాలేదు. రేషన్ కోసం ఆశతో వచ్చిన లబ్ధిదారులకు తీరా దుకాణంలో స్టాకు లేదని తెలిసి నిరాశతో వెనుతిరుగక తప్పని పరిస్థితి. జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే గోదాముల్లో ఉన్న బియ్యం నిల్వలను ఖాళీ చేసింది. ఇదే క్రమంలో డిసెంబర్ నెలకు సంబంధించిన సరుకుల సేకరణను నిర్లక్ష్యం చేసింది. ఒకటో తేదీన రావాల్సిన స్టాకు ఆరు రోజులు దాటినా రాకపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. కొన్ని షాపులకు సరఫరా చేసినట్లు జిల్లా అధికారులు చెబుతున్నా.. అది కూడా అరకొరే అన్నట్లుగా ఉందని డీలర్లు చెబుతుండడం విశేషం.

దొడ్డు బియ్యం తినకపోవడంతో..

జిల్లాలో 932 చౌక ధరల దుకాణాలు ఉండగా, వీటి పరిధిలో అంత్యోదయ కార్డులు 33,481 ఉన్నాయి. 91,356 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఆహార భద్రత కార్డులు 5,24,918 ఉండగా 17,31,750 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇక అన్నపూర్ణ ఆహార భద్రత కార్డులు 39 ఉండగా, 53 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఆయా లబ్ధిదారులందరికీ నెలకు సగటున 11,562.725 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. ఈ బియ్యాన్ని తినేందుకు మెజార్టీ ప్రజలు ఇష్టపడడం లేదు. కార్డు తొలగిస్తారనే భయంతో ఇష్టం లేక పోయినా బియ్యాన్ని రేషన్ షాపుల నుంచి తీసుకెళ్తున్నారు. దోశ, ఇడ్లీ, ఇతర పిండి వంటలకు సరిపడా ఉంచుకుని, మిగిలినవి కిలో రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఈ బియ్యాన్ని సమీపంలోని రైస్‌మిల్లులకు తరలించి సన్నగా పాలిష్ చేస్తున్నారు. చూసేందుకు సోనా మసూరి బియ్యంలా మార్చేస్తున్నారు. గుట్టుగా వీటిని లేబుల్ ప్యాకింగ్ బస్తాల్లో నింపి, మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

సన్న బియ్యానికి డిమాండ్

నిజానికి మిల్లర్ల నుంచి పౌరసరఫరాలశాఖ రెండు మూడు నెలల ముందే బియ్యాన్ని సేకరించి, గోదాముల్లో నిల్వ చేస్తుంది. సన్న బియ్యం పంపిణీ ప్రకటన నేపథ్యంలో అధికారులు ఈ అంశాన్ని విస్మరించారు. వర్షాకాలం వరి కోతలు మొదలవడం, రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్‌కు తరలిస్తుండటం, ఎఫ్‌సీఐ ద్వారా వాటిని కొనుగోలు చేసి, మిల్లర్లకు అప్పగిస్తుండటం తెలిసిందే. ఎఫ్‌సీఐకి రైతుల నుంచి ఆశించిన స్థాయిలో సన్న ధాన్యం రావడం లేదు. ప్రభుత్వ మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్లోనే అధిక ధర పలుకుతుండటంతో రైతులు తమ ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకు అమ్ముతున్నారు. ప్రైవేటుగా సన్న బియ్యానికి మంచి డిమాండ్ ఉండటంతో వారు కూడా వాటిని బయటికి తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో బియ్యం పంపిణీ ఇలా..

నెల	మొత్తం రేషన్‌కార్డులు	ట్రాన్సాక్షన్ టు పీఓఎస్	పోర్టబులిటీ
జనవరి	5,59,188	61,40,627	28,97,998
ఫిబ్రవరి	5,59,160	4,98,929	2,17,636
మార్చి	5,58,835	5,10,698	2,39,421
ఏప్రిల్	5,58,680	5,11,515	2,24,933
మే	5,58,664	6,06,343	2,40,497
జూన్	5,58,654	5,11,473	2,45,973
జూలై	5,58,585	4,98,977	2,35,387
ఆగస్టు	5,58,571	5,23,525	2,55,575
సెప్టెంబర్	5,58,503	5,26,139	2,58,422
అక్టోబర్	5,58,452	5,21,467	2,52,645
నవంబర్	5,58,447	5,22,912	2,57,746

కాషాయ పార్టీ కదనభేరి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఇతర నాయకులు

- నేటి బీజేపీ బహిరంగ సభకు సర్వం సన్నద్ధం
- సరూర్‌నగర్ స్టేడియంలో భారీ ఏర్పాట్లు
- జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాక..
- ఎంపీ ఎన్నికల తర్వాత ఇదే తొలి సభ
- 8 జిల్లాల నుంచి రానున్న నేతలు, కార్యకర్తలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై భారతీయ జనతాపార్టీ సమర శంఖం పూరించబోతోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత నగరంలో తొలిసారి భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. సరూర్‌నగర్ స్టేడియం వేదికగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహా పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొంటారు. ఏడాది తర్వాత నిర్వహిస్తున్న సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాషాయ పార్టీ.. భారీ జన సమీకరణ చేపడుతోంది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహా తెలంగాణవ్యాప్తంగా ఎనిమిది జిల్లాల నుంచి కార్యకర్తలను తరలించాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలపై ఈ వేదికగా బీజేపీ ఎండగట్టబోతోంది. ఈ మేరకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం సభాస్థలి, ఏర్పాట్లను పరిశీలించారు. ఈటల వెంట రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే అక్రమ అరెస్టులు



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

కాంగ్రెస్ గిరిజన విభాగం
జిల్లా కమిటీ చైర్మన్ శ్రీనునాయక్

షాద్‌నగర్‌రూరల్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అక్రమ అరెస్టులు, రౌడీషీట్‌లతో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని కాంగ్రెస్ గిరిజన విభాగం జిల్లా కమిటీ చైర్మన్ శ్రీనునాయక్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిరిజన నాయకులు మాట్లాడుతూ... పదేళ్ల పాలనలో ప్రశ్నించే గొంతులను నొక్కింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ప్రశ్నించే రైతులు, జర్నలిస్టులు, మహిళలపై అక్రమ కేసులను బనాయించి రౌడీషీట్లు నమోదు చేయించిన ఘనత వారిదే అన్నారు. రాంబల్ నాయక్ నీపై రౌడీషీట్ ఏ ప్రభుత్వం హయాంలో ఏ నాయకుడు నమోదు చేయించాడు? ఏ నాయకుడు మీ భూములు, ఆస్తులను కాజేశాడో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వం ఎంతమందిపై అక్రమ కేసులు బనాయించిందో లెక్కలతో సహా బయటకు తీస్తామని అన్నారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలపై ఒక్కసారి మాట్లాడని రాంబల్ నాయక్ బీఆర్ఎస్ అధికారం పడిపోగానే ఎల్‌హెచ్‌పీఎస్ అవతారమెత్తడం వెనుక డ్రామాలు అందరికి తెలుసు అన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ హోదాలో గిరిజన జాతిని బీఆర్ఎస్ కార్యక్రమాలవైపు పిలుపునివ్వడం సిగ్గుచేటన్నారు. కష్టకాలంలో ఉన్న నిన్ను ఆనాడు ఎవరు ఆదుకున్నారో మర్చిపోయావాఅని ప్రశ్నించారు. మా నాయకుడు కార్యకర్తల ఆస్తులు గుంజుకునేవారు కాదని, కార్యకర్తల స్థాయిని పెంచేవారిన అన్నారు. జాతి పేరుతో బీఆర్ఎస్‌కు ఊడిగం చేయాలనుకోవడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో గిరిజన నాయకులు నెహ్రూపవార్, రూప్లానాయక్, రవీందర్‌నాయక్, బాలు నాయక్, ప్రేమ్‌నాయక్, నారాయణ, తులసీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ ఫెస్ట్‌లతో నైపుణ్యాల వెలికితీత

- ఏపీ ఎన్ఐటీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు
- అవంతిలో 'టెక్ విడ్మెట్ 2కే 24' ఫెస్ట్ ప్రారంభం



అవంతిలో టెక్నికల్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు, అతిథులు

అబ్దుల్లాపూర్‌మెట్: విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు.. కళాశాలల్లో నిర్వహించే సాంకేతికోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రాయపూర్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ ఎన్ఐటీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ రమణారావు అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ×టెక్ విడ్మెట్ 2కే 24₹ ఫెస్ట్‌ను అవంతి గ్రూప్స్ ఆఫ్ చైర్మన్, ఏపీ మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, డీఆర్‌డీఏ శాస్త్రవేత్త శ్రావణ్ కుమార్ సంగంకర్‌తో కలిసి ప్రారంభించారు.

చదువు, ఉద్యోగాలకు పొంతన లేదు..

ప్రస్తుతం విద్యార్థుల చదువు, చేస్తున్న ఉద్యోగాలకు ఎలాంటి సంబంధం లేకుండా పోయిందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తంరావు అన్నారు. పరిశ్రమలకు అనుకూలంగా ఉండే అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవంతి గ్రూప్స్ ప్రెసిడెంట్ ముత్తంశెట్టి జ్ఞానేశ్వరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎంవీఎస్ఎస్ నందీష్, హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ బోసు బాబు, పీఆర్వో శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.

గొర్రెల కాపరిని బెదిరించేందుకు..

షాబాద్: తన పొలంలో గొర్రెలు మేపుతున్నాడనే ఆగ్రహంతో యజమాని ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపాడు. ఈ ఘటన మండల పరిధిలోని ముద్దెంగడూలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. నార్సింగికి చెందిన రియాజ్ ముద్దెంగూడలో పొలం కొనుగోలు చేశాడు. ఈ పొలంలో గ్రామానికి చెందిన గొర్రెల కాపరి లక్ష్మీనారాయణ జీవాలను మేపుతుండగా గమనించిన రియాజ్ తన పొలంలో ఎందుకు మేపుతున్నావంటూ ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపాడు. దీంతో ఆందోళనకు గురైన కాపరి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు రియాజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తన పొలంలో జరిగిన నష్టానికి విసిగి ఆగ్రహంతో కాల్పులు జరిపినట్లు తెలిపాడు. ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



సురేశ్ (ఫైల్)

షాబాద్: ఇంట్లోంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పటేల్‌గూడలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మాల సురేశ్(35) నెల రోజుల క్రితం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో సురేశ్ తండ్రి రాములు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. అదృశ్యమైన వ్యక్తి ఎత్తు 5.7, ఎరుపు రంగు టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

తాళం వేసిన ఇంటికి కన్నం

30 తులాల వెండి, నాలుగు గ్రాముల బంగారం, రూ.30వేల నగదు అపహరణ



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ సత్యనారాయణ

శంకర్‌పల్లి: గుర్తు తెలియనిన వ్యక్తులు తాళం వేసిన ఇంటికి కన్నం వేశారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి మండల పరిధిలోని ఎల్వర్తిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు టి.రామలక్ష్మయ్య గురువారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి శంకర్‌పల్లిలో ఆస్పత్రికి వెళ్లాడు. శుక్రవారం ఇంటికి రాగా తాళం పగులగొట్టి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించిన రైతు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు శంకర్‌పల్లి పోలీసులు క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్, సీసీఎస్ పోలీసులతో కలిసి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు ప్రకారం రూ.30వేల నగదు, 30 తులాల వెండి, నాలుగు గ్రాముల బంగారం చోరీ అయిందన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కేసుల పేరిట పాస్‌పోర్టు నిరాకరించొద్దు

అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కేసులున్నాయన్న కారణంగా పాస్‌పోర్టును నిరాకరించడం సరికాదని, పిటిషనర్‌కు పాస్‌పోర్టును అప్పగించాలని సంబంధిత అధికారులను హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని స్పష్టం చేసింది. ఖమ్మం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందన్న కారణంగా తన పాస్‌పోర్టును ఇవ్వడం లేదంటూ హైకోర్టులో హైదరాబాద్‌కు చెందిన పూర్ణచందర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ మౌషుమీ భట్టాచార్య విచారణ చేపట్టి.. ఉత్తర్వులు జారీ చేశారు. 'డిసెంబర్ 9 నుంచి రెండు వారాల్లోగా పిటిషనర్ పాస్‌పోర్టును విడుదల చేయాలి. ఎక్కడ, ఎప్పుడు పాస్‌పోర్టు అందజేస్తారో అధికారులు పిటిషనర్‌కు చెప్పాలి. అనుమతి లేకుండా దేశం విడిచి పారిపోనంటూ పిటిషనర్.. ఖమ్మం జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎదుట అఫిడవిట్ దాఖలు చేయాలి. అఫిడవిట్ దాఖలుపై కోర్టు రెండు వారాల్లో సర్టిఫైడ్ సర్టిఫికెట్ ఇవ్వాలి. దీనిని పిటిషనర్ పాస్‌పోర్టు అధికారులకు అందజేయాలి. ఒకవేళ దీనిని పిటిషనర్ ఉల్లంఘిస్తే అధికారులు నిర్ణయం తీసుకోవచ్చు'అని కోర్టు స్పష్టం చేసింది.

గ్రామాభివృద్ధి భేష్

కితాబిచ్చిన సిక్కిం సర్పంచ్‌ల బృందం



అజీజ్‌నగర్ పంచాయతీని సందర్శించిన సిక్కిం సర్పంచ్‌ల బృందం

మొయినాబాద్ రూరల్: గ్రామ పరిపాలన విధానం తెలుసుకునేందుకు సిక్కిం నుంచి 70 మంది సర్పంచ్‌ల బృందం ఎన్ఐఆర్డీ రాజేంద్రనగర్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అజీజ్‌నగర్ గ్రామాన్ని సందర్శించారు. ఎంపీడీఓ సంధ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి పరిపాలన, ప్రభుత్వ నిధుల వినియోగంపై అవగాహన కల్పించారు. అభివృద్ధి వివరాలను తెలుసుకున్న బృందం గ్రామాభివృద్ధి బేష్ అని కితాబిచ్చారు. అధికారుల ద్వారానే పాలన కొనసాగుతుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జెమిల్, ఎన్ఐఆర్‌డీ కోఆర్డినేటర్ జెరినాబేగం, ఎన్ఐఆర్‌డీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు సిద్ధమవ్వండి



మాట్లాడుతున్న యాదయ్య

ఇబ్రహీంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలకు సిద్ధమవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామేల్, యాదయ్య, బి.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఎం మూడో మహాసభలను స్థానిక పాషానరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర పాలకులు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో విఫలం చెందారన్నారు. హామీల అమలుకు ఉద్యమించాలన్నారు.

గృహిణికి డాక్టరేట్

లక్డీకాపూల్: పట్టుదల ఉంటే చదువుకు వయసు అడ్డం కాదని నిరూపించింది ఓ గృహిణి. బాగ్అంబర్ పేటలోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీకి చెందిన అంబాల చైతన్య ఇంటర్‌తోనే చదువు ఆపేసింది. కానీ చదువు మీద మక్కువతో పెళ్లయ్యాక ఏకేఎల్ఆర్ ఓరియంటల్ కాలేజీలో డిగ్రీ చదివి పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేశారు. అంతటితో ఆగకుండా 'తెలుగు భాష ఆధునీకరణలో తెలంగాణ పత్రికలు-వివిధ సంస్థల పాత్ర' అనే అరుదైన అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. వయసుతో నిమిత్తం లేకుండా పాతికేళ్ల తర్వాత పట్టుదలతో చదివి డాక్టరేట్ పొందిన చైతన్యను పలువురు అభినందించారు.

ఆరోగ్యం బాగాలేదని..

- సూసైడ్ నోట్ రాసి.. హాస్టల్ గదిలో ఉరేసుకుని..
- అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య
- కళాశాల ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన



శ్రావణి (ఫైల్)



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం మైలారం కొత్త తండాకు చెందిన బలరాం నాయక్, కవితలకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు శ్రావణి (18) దుండిగల్‌లోని మర్రి లక్ష్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ కళాశాలలోని హాస్టల్‌లో ఉంటోంది. రెండు రోజుల క్రితం తన స్వగ్రామానికి వెళ్లి తిరిగి హాస్టల్‌కి వచ్చిన శ్రావణి.. శుక్రవారం తన ఆరోగ్యం బాలేదని కళాశాలకు వెళ్లకుండా హాస్టల్లోనే ఉంది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో హాస్టల్ గదిలోని తోటి మిత్రులు వచ్చి తలుపులు తట్టినా తీయలేదు. హాస్టల్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడడంతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే శ్రావణిని సూరారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రావణి తనకు ఆరోగ్యం బాలేదని కడుపునొప్పి కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఉందని పోలీసులు తెలిపారు. కాగా.. తమ కుమార్తె శ్రావణి ఎంతో ధైర్యవంతురాలు అని, ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని హాస్టల్ నిర్వాహకులే ఏదో చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ.. కళాశాల ఎదుట మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు. దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పి.. ఆందోళనను విరమింపజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

షాబాద్: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వెంకటేశ్ అన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 44 సంవత్సరాలుగా ఎస్టీగా మార్చాలని పోరాడుతున్నట్టు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాహుల్‌గాంధీ వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మేనిఫెస్టోలోనూ వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి సరిపడా నిధులు ఇస్తామని పొందుపరిచారన్నారు. ఇప్పటివరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో షాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాల వడ్డెర సంఘం అధ్యక్షులు గోవుల అంజయ్య, ఆలకుంట వెంకటేష్, విడగోటి పరమేష్, నాయకులు గోవుల శ్రీశైలం, చల్లా రవి, పల్లపు రాజేందర్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై అదుపుతప్పిన లారీ

రాజేంద్రనగర్: ఓఆర్ఆర్‌పై లారీ అదుపుతప్పి సర్వీసు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. (ఏపీ 13ఎక్స్ 9782)నంబర్ వాహనం గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు భారీ మిషనరీ విభాగాలతో వెళ్తున్నది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో హిమాయత్‌సాగర్ ఔటర్ వద్దకు రాగానే డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా వాహనం అదుపుతప్పి ఔటర్‌పై రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన భారీ కంచెలను ధ్వంసం చేసుకుంటూ సర్వీస్ రోడ్డుపైకి దాదాపు 100 మీటర్ల దూరం వరకు వెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను పోలీసులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఘటన కారణంగా ఓఆర్ఆర్‌పై ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలను క్రమబద్ధీకరించారు. ఈ విషయమై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కోతి కళేబరాన్ని ఖననానికి తీసుకెళ్తున్న గ్రామస్తులు



ముందు నడుస్తున్న వానర సమూహం

సంప్రదాయంగా వానరం అంత్యక్రియలు

మోత్కూర్ గ్రామంలో వానరాల గుంపు నిత్యం సంచరిస్తుంటాయి. ఇందులో ఓ కోతి కొంతకాలంగా తీవ్ర అస్వస్థతో ఇబ్బంది పడుతూ శుక్రవారం మృత్యువాతపడింది. దీంతో గ్రామస్తులు గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు జరిపారు. స్నానం చేయించి.. నూతన వస్త్రాలు వేసి.. డప్పు చప్పుళ్లతో ఊరేగించి ఖననం చేశారు. కాగా అంత్యక్రియలు జరిపిస్తున్న సమయంలో వానరాల గుంపు అంతిమయాత్రలో ముందు నడిచాయి. – దోమ